## క్లుప్తంగా

### వేం నరేందర్‌రెడ్డికి అభినందనలు



రాయపర్తి : మండలంలోని జగన్నాథపల్లికి చెందిన మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నంగునూరి అశోక్ ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని ఆదివారం కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో పార్టీ పరిస్థితిపై అశోక్‌తో నరేందర్‌రెడ్డి చర్చించారు. పార్టీ బలోపేతానికి పాటుపడాలని సూచించారు.

### గురుకుల ప్రవేశ పరీక్ష



రాయపర్తి : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఐదో తరగతిలో ప్రవేశం కోసం ఆదివారం నిర్వహించిన పరీక్షకు 364 మంది విద్యార్థులు హాజరైనట్టు ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర్ తెలిపారు. స్థానిక వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై ఉన్న కళాశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించడంతో విద్యార్థులు, తల్లిదండ్రులతో రహదారిపై రద్దీ నెలకొంది. మొత్తం 384 మంది దరఖాస్తు చేయగా 364 మంది హాజరయ్యారు.

### దొంగ అరెస్ట్



గీసుకొండ : వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు దొంగ దొరికాడు. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్–నర్సంపేట ప్రధాన రహదారిపై గొర్రెకుంట క్రాస్ వద్ద ఇన్‌స్పెక్టర్ బాబులాల్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మారుతి స్విఫ్ట్ కారులో వెళ్తున్న ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలంలోని వీఎం బంజర గ్రామానికి చెందిన తురపాటి ప్రసాద్ అనుమానాస్పదంగా కనిపించాడు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా అతడు గొర్రెకుంటలో గతంలో బంగారం దొంగతనం చేసి హైదరాబాద్‌లో అమ్మేసి కారు కొనుగోలు చేసినట్టు తెలిపాడు. దీంతో పోలీసులు ప్రసాద్‌ను అరెస్ట్ చేసి కారును సీజ్ చేశారు.

### ఆర్థికసాయం



చెన్నారావుపేట : మండలంలోని పాత ముగ్దుంపురం గ్రామానికి చెందిన ఆకుల రవీందర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి స్నేహ పరపతి సంఘం బాధ్యులు ఆదివారం రూ.10 వేల సాయం అందజేశారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు వనపర్తి నర్సయ్య, బుడిగె కుమారస్వామి, ఈగ సత్యనారాయణ, కొండపర్తి కృష్ణమోహన్, గట్ల రవీందర్, బండారి భిక్షపతి, దొనికెల భద్రయ్య, బొనగాల రమేశ్, ఆకుల అశోక్, శంకేసి రంజిత్, పిట్టల కుమారస్వామి, కల్వచర్ల నరేందర్, ననుమాస వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

### చేతి పంపు ప్రారంభం



చెన్నారావుపేట : మండలంలోని ఎల్లాయిగూడెంలో హైదరాబాద్‌కు చెందిన చీర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేతి పంపును ఆ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బత్తిని అశోక్‌గౌడ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రానున్న వేసవి కాలం నేపథ్యంలో తాగునీటి ఎద్దడి నివారించేలా చేతిపంపు ఏర్పాటు చేసినట్టు తెలి పారు. ప్రజలు చేతి పంపును వినియోగించుకోవా లని కోరారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు రాజేశ్, ఆకుల అశోక్, శ్రీకాంత్, శివ, మాజీ సర్పంచ్ జయ జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

### 16న భారత్‌బంద్

ఐనవోలు : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16న భారత్‌బంద్ నిర్వహించనున్నట్టు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బొట్ల చక్రపాణి తెలిపారు. మండల కేంద్రంలో దర్శనాల సంపత్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గడచిన పదేళ్లలో ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేసిందని మండిపడ్డారు. అనంతరం చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కాడబోయిన లింగయ్య మాట్లాడారు. సమావేశంలో నాయకులు గుండెకారి మహేందర్, మడిగె నాగరాజు, శంకర్‌రెడ్డి, రాంకుమార్, తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తోందని స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో లక్కమారి రెడ్డి సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సంఘం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజాభీష్టం మేరకు పాలన సాగిస్తుందని తెలిపారు. అన్ని కులాలు, మతాల అభివృద్ధికి ప్రణాళికాయుతంగా కార్యాచరణ చేపట్టనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర మల్లారెడ్డి, నాయకులు నూనె మల్లారెడ్డి, గాదె మోహన్‌రెడ్డి, గోనె సంతోశ్‌రెడ్డి, కడుదూరి సంపత్‌రెడ్డి, పెంతల శ్రీకాంత్‌రెడ్డి, పెంతల నాగిరెడ్డి, కొనుకటి కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



లక్కమారి రెడ్డి సంఘం క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

**గీత కార్మిక సంఘం..**

పట్టణంలోని ద్వారకపేట రోడ్డులోని కల్లు మండువ వద్ద గీత కార్మిక సంఘం క్యాలెండర్‌ను వృత్తి సంఘాల జిల్లా నిర్మాణ బాధ్యులు పంజాల రమేశ్, బైరి తిరుపతి ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడారు. గీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ గీత కార్మిక సంఘం నిరంతరం పోరాడుతోందని చెప్పారు. గీత కార్మికులకు రూ.5వేల పెన్షన్, ఇంటి స్థలాలు, పక్కా గృహాలు, ప్రమాద బీమా, తదితర సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం బాధ్యులు పాలకుర్తి కృష్ణ, గాదగోని శంకర్, రవి, వెంకటేశ్, సాంబయ్య, గౌడ వృత్తి సంఘాల జిల్లా నాయకులు గోవర్ధన్ మియాపురం, పార్థసారధి, తదితరులు పాల్గొన్నారు.



గీత కార్మిక సంఘం క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

# జోరుగా.. హుషారుగా బర్డ్ వాక్

ఖానాపురం : మండలంలోని పాకాలలో బర్డ్ వాక్ కార్యక్రమం జోరుగా.. హుషారుగా సాగింది. ఎంతో ఉత్సాహంగా చేపట్టిన బర్డ్ వాక్ ఆదివారంతో ముగిసింది. హైదరాబాద్ బర్డింగ్ పాల్ ఆధ్వర్యంలో బర్డ్ వాక్ కార్యక్రమాన్ని చేపట్టగా హైదరాబాద్‌తోపాటు పలు ప్రాంతాలకు చెందిన వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు. శని, ఆదివారాల్లో పాకాల అటవీ ప్రాంతంలో 150 రకాల పక్షులను గుర్తించారు. ఇందులో తొలిసారిగా పాకాలకు వచ్చిన నాలుగు నూతన పక్షులను గుర్తించారు. అలాగే గూడూరు పరిధిలోని భీమునిపాదం జలపాతం వద్ద రూఫస్ వడ్రంగి పిట్ట, ఎల్లోబ్రౌవ్ వార్బ్లర్, బ్రౌన్‌హాక్ గుడ్లగూబ, పెయింటెడ్ సాండ్ గ్రౌస్, ఇండియన్ బ్లూ రాబిన్, ఫ్లైక్యాచర్స్, బ్లాక్ ఈగల్ వంటి పక్షులను గుర్తించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు సమావేశంలో రిటైర్డ్ డీఎఫ్‌ఓ పురుషోత్తం మాట్లాడారు. వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్లు వృత్తిలో రాణించాలని ఆకాంక్షించారు. అటవీ ప్రాంతంలో ఉన్న పక్షులను గుర్తించి ప్రజల దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఫొటోగ్రాఫర్లకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఔల్స్ జిల్లా బాధ్యుడు నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్లతో పురుషోత్తం

# అర్హులందరికీ సబ్సిడీ గ్యాస్ సిలిండర్

- మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోతు అరుణ

వర్ధన్నపేట : అర్హులందరికీ సబ్సిడీపై గ్యాస్ సిలిండర్ లభిస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోతు అరుణ తెలిపారు. పట్టణంలో చేపట్టిన మహాలక్ష్మి పథకం గ్యాస్ కనెక్షన్ల దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని ఆదివారం ఆమె మున్సిపల్ కమిషనర్ జోనాతో కలిసి క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ అరుణ మాట్లాడారు. పట్టణంలో వార్డుల వారీగా అధికారులను కేటాయించి ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలించి అర్హులను గుర్తిస్తున్నట్టు తెలిపారు. అర్హులకు గ్యారెంటీ పథకాలు అమలయ్యేలా చొరవ తీసుకుంటామని చెప్పారు. అధికారులు విధి నిర్వహణలో సమర్థత చాటాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



దరఖాస్తుల పరిశీలనలో చైర్‌పర్సన్, సిబ్బంది

## సన్నూరు ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన



రాయపర్తి : మండలంలోని సన్నూరు వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి నిర్మాణ పనులను ఆదివారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరిశీలించారు. పాలకుర్తి ఎమ్మెల్యేగా పని చేసినప్పుడు చేపట్టిన పనులు ఎలా జరుగుతున్నాయో తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, ఎంపీటీసీ గోవింద్‌నాయక్, మాజీ సర్పంచ్‌లు నలమాస సారయ్య, యాకమ్మ, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, తాళ్లపల్లి సంతోష్‌గౌడ్, యాకూబ్‌రెడ్డి పాల్గొన్నారు.

## నిమ్స్ ఆర్‌ఎంఓ పూజలు

గీసుకొండ : మండలంలోని కొమ్మాల లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రి ఆర్‌ఎంఓ, తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మార్త రమేశ్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి పూజ చేయించి సన్మానించారు. అనంతరం డాక్టర్ రమేశ్ తన స్వగ్రామమైన ఎలుకుర్తి హవేలిలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు కోసం రూ.25 వేల విరాళం అందించారు. కార్యక్రమంలో కొమ్మాల ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు వీరాటి లింగారెడ్డి, రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు తిప్పారపు రవీందర్, దనేకుల రాంబాబు, బొడిగతె శోభన్ పాల్గొన్నారు.

# ‘బాలసంస్కార్’తో నైతిక విలువల పెంపు



బాలలతో రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు చింతపట్ల సురేందర్, తదితరులు

పర్వతగిరి : శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలసంస్కార్ కార్యక్రమంతో విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందుతాయని రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు చింతపట్ల సురేందర్ తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన బాలసంస్కార్ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుకోవడంతోపాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ జంగ ప్రసాద్ మాట్లాడుతూ స్థానిక శ్రీరామకృష్ణ సేవా సమితి ప్రాంగణంలో ఆదివారాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బాలసంస్కార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల ఉద్యోగం పొందిన కంటెం సంతోశ్ విద్యార్థులకు స్వామి వివేకానంద యొక్క, తన అనుభవాన్ని తెలిపారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆఫ్ పర్వతగిరి ప్రతినిధి చిదురాల వేణుగోపాల్ పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి బాధ్యులు రమేశ్, వివేక్, రణధీర్, చిదరాల సంధ్య, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్‌తో ఆర్థిక పునరుజ్జీవానికి పునాది

వర్ధన్నపేట : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలే లక్ష్యంగా ఆర్థిక వ్యవస్థ పునరుజ్జీవానికి పునాది వేసేలా బడ్జెట్‌లో నిధులు కేటాయించిందని కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య తెలిపారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం తొలి బడ్జెట్‌లో ఆరు గ్యారెంటీల అమలు కోసం రూ.53,196 కోట్లు కేటాయించిందని చెప్పారు. దళిత సంక్షేమానికి రూ.21,874 కోట్లు కేటాయించి చిత్తశుద్ధి చాటుకుందని తెలిపారు. సమావేశంలో నాయకులు మల్లెపాక సమ్మయ్య, చెరుపెల్లి బాబు, కందిక ఎల్లస్వామి, బొడ్డు యాదగిరి, దుబ్బ ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటయ్య

# బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న సీఐ చంద్రమోహన్

చెన్నారావుపేట : బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని సీఐ చంద్రమోహన్ తెలిపారు. మండలంలోని కోనాపురం గ్రామంలో జాగృతి పోలీసు కళాజాత బృందం ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలు, డయల్ 100, బాల్యవివాహాలు, బాల కార్మికులు, సీసీ కెమెరాల ఏర్పాటు, ప్రభుత్వ నిషేధిత గుట్కా, గంజాయి, డ్రగ్స్, సైబర్ నేరాలు, తదితరాలపై ప్రజలకు ఆటపాటల ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. అసాంఘిక శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మూఢనమ్మకాలను వీడాలని చెప్పారు. సమాజంలోని అన్ని అంశాలపైనా ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యవంతం చేసే దిశగా కళాజాత బృందం కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై వస్తం శ్రీనివాస్, జాగృతి కళాబృందం ఇన్‌చార్జ్, ఏఎస్సై నాగమణి, సభ్యులు విలియమ్, వెంకటేశ్వర్లు, రత్నయ్య, శ్రీనివాస్, నారాయణ, విక్రమ్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకంఠమహేశ్వరస్వామికి జలాభిషేకం

నర్సంపేట రూరల్ : మండలంలోని సర్వాపురం, ద్వారకపేట గ్రామాల గౌడ కులస్తులు శ్రీకంఠమహేశ్వరస్వామికి జలాభిషేకం నిర్వహించారు. డప్పుచప్పుళ్ల నడుమ గౌడ కులస్తులు రాగిబిందెల్లో నీళ్లతో ర్యాలీగా ఆలయానికి చేరుకోని పూజలు నిర్వహించారు. అనంతరం జలాభిషేకం చేసి మొక్కులు చెల్లించారు. తదనంతరం రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు శీలం వీరన్న, ప్రధాన కార్యదర్శి సట్ల సురేశ్, ఉపాధ్యక్షుడు కందుకూరి అశోక్, బొట్టు పెద్దమనుషులు కందుకూరి బాబు, బూర్గు సాయిరాజ్, కొండి రాము, బూర్గు కట్టన్న, మండ రవి, దొమ్మటి శ్రీనివాస్, ఇలసారపు నరేందర్, బూర్గ సాంబయ్య, గొడిశాల కుమారస్వామి, గోవర్ధన్, శీలం ఎల్లగౌడ్, చిన్న వీరన్న, గందసిరి సాంబరాజు, రాజేశ్, మేర్గు రమేశ్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఆలయానికి నీటి బిందెలతో వెళ్తున్న గౌడ కులస్తులు

# కేజ్‌వీల్స్ ట్రాక్టర్లతో రోడ్లకు నష్టం



రోడ్డుపై ప్రయాణిస్తున్న కేజ్‌వీల్స్ ట్రాక్టర్

చెన్నారావుపేట : కేజ్‌వీల్స్ ట్రాక్టర్ల రాకపోకలతో రోడ్లు దెబ్బతింటున్నాయి. పోలీసు అధికారులు పలుమార్లు హెచ్చరికలు చేసినా కొందరు ట్రాక్టర్ యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇనుప కేజ్‌వీల్స్‌తో రోడ్లపై ప్రయాణిస్తున్న ట్రాక్టర్లతో రోడ్లు దెబ్బతింటున్నాయని మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు దెబ్బతిన్న అనంతరం ఆ రోడ్లపై ప్రయాణించే ద్విచక్ర వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయని పలువురు వాపోతున్నారు. మండలంలోని మాధవనగర్, జల్లి, తిమ్మరాయునిపహాడ్, బోజేర్వు, తదితర గ్రామాల శివార్లలో కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తుండడం పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖల అధికారులు స్పందించి కేజ్‌వీల్స్ ట్రాక్టర్లను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

# వరికి ‘మొగి’గండం... కుళ్లిపోతున్న పంట

సంగెం : అన్నదాతపై ప్రకృతి కన్నెర్ర చేస్తోంది. గత ఖరీఫ్‌లో వేసిన పంటల దిగుబడి సరిగా లేక అన్నదాతలకు నష్టాలనే మిగిల్చింది. వరి పంట చేతికొచ్చే దశలో అకాల వర్షం కురవడంతో పొలాలు ఆరక సాధారణ వరి యంత్రాలు బురదలో నడవకపోవడంతో ఎకరాకు రూ.6–7 వేల వరకు వెచ్చించి చైన్ యంత్రంతో కోత కోయించారు. రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇక యాసంగి వరిపైనే అన్నదాతలు గంపెడాశ పెట్టుకుని సాగు చేస్తున్నారు. ఆదిలోనే తెగుళ్లు ఆశించి నాటేసిన 15 రోజుల తర్వాత నుంచి మొగిపురుగుతో నాటు దుంపులు వేయాల్సిన సమయంలో ఎర్రబారి మొగి కుళ్లిపోతుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

**కోలుకోని వరి నాటు**

మండలంలోని షాపూర్, తీగరాజుపల్లి, సోమ్లాతండ, తిమ్మాపూర్, ఎల్గూర్‌స్టేషన్, గాంధీనగర్ తదితర గ్రామాల్లో వరిలో మొగిపురుగు సోకడంతో నాటు వేసిన 15 రోజులకే ఎర్రబారి కుళ్లిపోయి నేల వాలిపోతున్నది. సస్యరక్షణ చర్యలు చేపట్టినా ఫలితం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. దుక్కి దున్నిన నాటి నుంచి నాటు, ఎరువులు, పురుగుల మందులకు ఎకరాకు సుమారు రూ 20 వేలు ఖర్చు చేసినట్లు అన్నదాతలు చెబుతున్నారు.

**పురుగు ఉధృతికి కారణాలు**

వాతావరణంలో వచ్చిన మార్పులు, ముదిరిన వరి నారు నాటు వేయడం, ఖరీఫ్ తర్వాత పొలం ఆరకపోవడం, నాటు వేసే ముందు నారు కొనలు తుంచకపోవడం, ప్రతీసారి వరి సాగు చేయడం, మోతాదుకు మించి యూరియా వాడడం వంటివి మొగిపురుగు ఉధృతికి కారణమని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఉదయం, సాయంత్రం రెక్కల (మొగి) పురుగులను పరిశీలించడం, కుళ్లిన మొక్కలను పీకిన తర్వాత కుళ్లిన వాసన వస్తే మొగిపురుగు ఆశించిందని తెలుసుకోవాలి. ఇది కాండంలోకి చొచ్చుకుపోయి స్థావరాన్ని ఏర్పాటు చేసుకుని నీరు, పోషక పదార్థాలను అందకుండా చేస్తుంది. డిసెంబర్, జనవరి మొదటి వారంలో వేసిన వరి పంటలకు ఎక్కువగా ఉందని రైతులు చెబుతున్నారు. తిరిగి నాటు వేయాలంటే వరి నారు దొరకడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.



తీగరాజుపల్లిలో మొగి పురుగు సోకి కుళ్లిన వరి పంట

**పెట్టుబడి వచ్చేలా లేదు**

వరి నాటు వేసి 20 రోజులు గడిచింది. మంచిగా పిలుకలు వేసి దుబ్బు కట్టాల్సిన సమయంలో మొగిపురుగు సోకి గంట కుళ్లిపోయి ఎర్రబారుతోంది. ఇప్పటికే ఎకరాకు రూ 20 వేలు పెట్టుబడి పెట్టా. వరి కుళ్లిపోతుంటే ఏం చేయాలో పాలుపోవడం లేదు. వ్యవసాయాధికారులు సూచనలు చేస్తే పంటలను కాపాడుకొంటాం.

–అల్ల అమరలింగస్వామి, రైతు, గాంధీనగర్

**పిలక దశలో మొగిపురుగు ఉధృతి**

యాసంగి వరిలో పిలక దశలో మొగిపురుగు ఉధృతి ఎక్కువగా ఉంది. వరి నాటు వేయడానికి వారం రోజుల ముందు నారుమడిలో కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు వేయాలి. ఎప్పుడూ ఒకే రకమైన పంట వేయకూడదు. పంటలో ఉధృతిని గుర్తించడానికి పొలంలో దీపపు ఎరలు, లింగార్షక బుట్టలు ఏర్పాటు చేయాలి. లార్వా దశలో పైరుకు నష్టం కలిగించే అవకాశాన్ని గుర్తించిన వెంటనే పొలంలో నీరు పూర్తిగా తీసి వేసి ఆరబెట్టాలి. టిల్ట్ 1 ఎంఎల్ లేదా కాంటాఫ్ 2ఎంఎల్ లేదా వాలిడామైసిన్ 2 రీ చేయాలి. వారం, పది రోజుల తర్వాత మరోసారి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుంది.

–సీహెచ్.యాకయ్య, మండల వ్యవసాయ అధికారి

# పొదుపుతో భవిష్యత్‌కు భరోసా

నర్సంపేట రూరల్ : డబ్బు పొదుపు చేసుకుంటే భవిష్యత్తుకు భరోసా ఉంటుందని ప్రతిభ పురుషుల పొదుపు పరస్పర సహకార పరిమిత సంఘం అధ్యక్షుడు బీరెల్లి సుధాకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని సర్వాపురంలో ఆ సంఘం 30వ వార్షిక మహాసభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి మాట్లాడారు. వ్యక్తిగతంగా చేయలేని పనులను సంఘటితంగా సాధించవచ్చని తెలిపారు. సమాజంలోని ప్రతీ ఒక్కరు పొదుపు అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం అధ్యక్షుడిగా బీరెల్లి సుధాకర్‌రెడ్డిని, ఉపాధ్యక్షుడిగా గంట చందర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ముగ్దుంపురం సమితి అధ్యక్షుడు రవి, సంఘం కార్యవర్గ సభ్యుతదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి

# అగ్రంపహాడ్ జాతరకు ఏర్పాట్లు చేయాలి

ఆత్మకూరు : ఈనెల15 నాటికి అగ్రంపహాడ్ సమ్మక్క–సారలమ్మ జాతర పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మండలంలోని ఆ జాతర ప్రాంగణంలోని పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం సమ్మక్క–సారలమ్మలను దర్శించుకున్నారు. శాఖల వారీగా పనుల పరిస్థితి తెలుసుకున్నారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని, స్నానాలు చేసేందుకు ఏర్పాట్లు చేయాలని, ఇతర వసతులు కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస్, ఎంపీపీ మార్క సుమలత రజనీకర్, జెడ్పీటీసీ కక్కెర్ల రాధికరాజు, తదితరులు పాల్గొన్నారు.

# మతిస్థిమితం లేని వ్యక్తికి ఆశ్రయం

వర్ధన్నపేట : మతిస్థిమితం లేని మూగ వ్యక్తిని సహృదయ అనాథ వృద్ధాశ్రమ నిర్వాహకులు ఆశ్రయం కల్పించారు. వివరాలిలా.. పట్టణంలో ఓ మతిస్థిమితం లేని మూగ అనాథ వ్యక్తి కొద్ది రోజులుగా పట్టణంలో భిక్షాటన చూస్తూ స్మశానవాటికలో పడుకుంటున్నాడు. ఈ సమాచారం తెలిసి హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని సహృదయ అనాథ వృద్ధాశ్రమ నిర్వాహకుడు, స్వచ్ఛంద సేవా సంస్థ కార్యకర్త మహ్మద్ చోటూ స్పందించారు. సదరు మతిస్థిమితం లేని వ్యక్తిని సహృదయ వృద్ధాశ్రమానికి తీసుకెళ్లి ఆశ్రయం కల్పించారు. గడ్డం, జుట్టు తీయించి స్నానం చేయించి కొత్త దుస్తులు ధరింపజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకుడు, వర్ధన్నపేట మాజీ జెడ్పీటీసీ కమ్మగోని ప్రభాకర్, వలీ పాషా, రషీద్ తదితరులు పాల్గొన్నారు.



మతిస్థిమితం లేని వ్యక్తితో చోటూ

## ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం



పర్వతగిరి : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో 2004–05 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఘనంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్వవిద్యార్థులు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పూర్వవిద్యార్థులు స్కూలుకు బ్యాటరీ, చార్జర్‌ను డొనేట్ చేశారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించారు. ఉపాధ్యాయులు రామ్ బ్రహ్మచారి, పాక రమేశ్, ఉషశ్రీ, సునీత, విద్యాసాగర్, సారంగపాణి, శేఖర్, భాస్కర్, అటెండర్లు కొమురయ్య, మల్లయ్య, రాజు పాల్గొన్నారు.